క్లుప్తంగా

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: న్యాయసేవాధికార సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన ఐజిల్ వాటర్‌ప్లాంట్‌ను సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాసంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, బార్ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారి హరికృష్ణ, కోర్టు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాల గణపతికి వెండి తమలపాకుల హారం



హారం అందజేస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలో ఇందిరానగర్ జంక్షన్‌లోని బాల గణపతి దేవాలయంలో స్వామి వారికి సోమవారం రూ.50 వేల విలువైన వెండి తమలపాకుల హారాన్ని దుబ్బాల అప్పారావు విజయలక్ష్మి దంపతులు అందించారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాంరెడ్డి, సురంజని, శ్రీధర్‌రెడ్డి, శ్వేత, షఫీశ్రీ అల్పాహారంను అందించారు. దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు, అర్చకులు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

‘108’లో ప్రసవం

తిరుమలాయపాలెం: 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని కాకరవాయి శివారు మంగలిబండతండాకు చెందిన బానోత్ సుజాతకు పురిటి నొప్పులు రావడంతో 108లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమై మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108 సిబ్బంది, ఈఎంటీ క్రిష్ణయ్య తెలిపారు.

పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తా...

కారేపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని, రెట్టింపు ఉత్సాహంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నందున ఎవరూ అధైర్యపడొద్దని వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ సూచించారు. కారేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయన అనారోగ్య బాధితులను పరామర్శించడంతో పాటు శుభకార్యాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు, మార్కెట్ డైరెక్టర్ వాంకుడోతు నరేష్‌తో పాటు ముత్యాల సత్యనారాయణ, శ్రీనివాసరావు, రామ్మూర్తినాయక్, పుల్లారావు, కుర్సం సత్యనారాయణ, రంగారావు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: పట్టణ శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా మన్నె కృష్ణారావు, గౌరవాధ్యక్షులుగా నాగేశ్వరరావు, కె.శ్రీను, డైరెక్టర్లుగా కొండ ఉపేందర్, మేట్టెల నరేష్, గూటి తిరుపతిరావు, రేపాకుల శివ, సోమనబోయిన వెంకన్న, కురాకుల సంపత్, మన్నె శ్రీను, మల్లపోయిన సత్యనారాయణ, చిలకల ఉపేందర్, పి.అంజి, దాసరి ఉదయ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీని సన్మానించి, పలు తీర్మానాలు ఆమోదించారు. నాగేశ్వరరావు, రవి, మన్నె లింగరావు, ఉపేందర్, వెంకన్న, సత్యనారాయణ, వినోద్, రాజేష్, రామారావు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇవ్వాలి

ఖమ్మం సహకారనగర్: రేషన్‌కార్డులు లేని జర్నలిస్టులకు రేషన్‌కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు కోరారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ ఖదీర్, దువ్వ సాగర్, కూరాకుల గోపి తదితరులు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కూసుమంచి: ఈ నెల 20న వైరాలో జరిగే తెలంగాణా రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు భూక్యా ప్రసాద్ కోరారు. సోమవారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో మంగళవారం నిర్వహించే తెలంగాణా గిరిజన సమాఖ్య పాలేరు డివిజన్ కమిటీ మహాసభను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు భూక్యా వీరన్న కోరారు.

కన్నేశారు.. తోడేస్తున్నారు..

రాత్రింబవళ్లు తేడాలేకుండా మట్టితోలకాలు

- కరిగిపోతున్న మట్టి గుట్టలు, ప్రభుత్వ భూములు
- ఇళ్ల నిర్మాణ పనులు, వెంచర్లకు అమ్మకం
- అధికారుల పర్యవేక్షణ లేక చెలరేగిపోతున్న అక్రమార్కులు



ఎం.వెంకటాయపాలెంలో తవ్వకాలలో తేలిన గుంతలు

ఖమ్మంరూరల్: అక్రమాల్లో ఆరితేరిన కొందరు కబ్జాకు కాదేది అనర్హం అన్నచందంగా కుంటలు, మట్టి గుట్టలు, ప్రభుత్వ భూములను తవ్వి సొమ్ము చేసుకుంటూ వాటిని గుల్లచేస్తున్నారు. దశాబ్దకాలంగా ప్రభుత్వ భూములు, గుట్టల్లో దశలవారీగా తవ్వి అక్రమార్కులు మట్టిని భారీ మొత్తంలో తరలిస్తూనే ఉన్నారు. కనిపించిన గుట్టనల్లా యంత్రాలు, పెద్ద జేసీబీలను పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో భారీగా మట్టిని తరలిస్తున్నారు. తవ్విన మట్టిని ఒక్కో ట్రాక్టర్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు, టిప్పర్ రూ.2 వేలు నుంచి రూ.2,500 వరకు ఇళ్ల నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటుకు తరలిస్తూ దళారులు మట్టి అక్రమ దందా రాయుళ్లు జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వడంతో పెద్ద గుంతలుగా ఏర్పడుతున్నా, కళ్ల ముందే మట్టి కరిగిపోతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మంరూరల్, కూసుమంచి మండలాల్లో జోరుగా సాగుతోన్న ఈ మట్టి దందా అక్రమార్కులపై కాసుల వర్షం కురిపిస్తోంది.

రోడ్డు ప్రమాదాలూ నిత్యకృత్యం

ఇష్టానుసారం మట్టిని తవ్వడంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు మట్టి తరలించే వాహనాల రద్దీతో రోడ్లన్నీ గుంతలమయంగా మారి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతున్నాయి. మట్టిలోడుతో ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ముత్తగూడెంలో మట్టి ట్రాక్టర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమీ పట్టించుకోకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లు మట్టి తరలిస్తూ అనేక ప్రమాదాలకు కారణమవుతున్నా పోలీసులు కూడా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అక్రమదారుల చర్యలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటు పర్యావరణాన్ని ఇటు ప్రభుత్వ భూములను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

నాయకుల అండతో..

మట్టి అక్రమరవాణాలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికార విపక్ష పార్టీలకు చెందిన నాయకులు చక్రం తిప్పుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏదైనా అంటే తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తన పని యథాతథంగా కానిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూరల్ మండలంలోని పల్లెగూడెంలో ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఏళ్ల తరబడి అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటో ఎవరికి అంతుబట్టడంలేదు. ఇలా ప్రజాప్రతినిధులు, నాయకులు అండ ఉండటంతో మట్టిదందా రాయుళ్లు అడ్డూఅదుపు లేకుండా మరీ రెచ్చిపోతున్నారు. గోళ్లపాడు, పల్లెగూడెం గ్రామాల పరిధిలో రేయింబవళ్లు తమ పలుకుబడితో నిరంతరాయంగా మట్టిని తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు.



ఆరేకోడులోని ప్రభుత్వ భూమిలో..

ఎవరైనా ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారులకు వారి అనుచరుల నుండి వేధింపులు తప్పడంలేదు. ఈ అక్రమార్కుల జోలికి వెళ్లేందుకు సంబంధిత అధికారులు జంకుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఖమ్మం అర్బన్ మండలం నుంచి కొంతకాలంగా వందల కొద్దీ టిప్పర్లు రూరల్ మండలంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

విస్తృత తనిఖీలు చేస్తున్నాం..

ఎక్కడైనా అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నాయనే సమాచారం వస్తే వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి దాడులు చేస్తున్నాం. పట్టుబడిన ట్రాక్టర్లను, జేసీబీలను సీజ్ చేసి, యజమానులకు జరిమానా విధిస్తున్నాం. మరిన్ని దాడులు నిర్వహించి అక్రమ మట్టి తోలకాలను అరికడతాం.

– పి.రాంప్రసాద్, తహసీల్దార్, ఖమ్మం రూరల్

రైతుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి



తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న హేమంతరావు



కామేపల్లి: మాట్లాడుతున్న గోవిందరావు

తిరుమలాయపాలెం: రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని, మద్దతు ధరల కోసం రైతాంగ ఉద్యమాలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు అన్నారు. సోమవారం మండలంలోని కొక్కిరేణిలో జరిగిన రైతు సంఘం మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఇంటూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా చావా వెంకట్రావుతో పాటు 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి రాధాకృష్ణ, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

కామేపల్లి: రాష్ట్రంలోని రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గోండపత్తి గోవిందరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 3వ మహాసభను మండలంలోని తాళ్లగూడెంలో నిర్వహించగా కామేపల్లి, కారేపల్లి మండలాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం కామేపల్లి, కారేపల్లి మండలాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామేపల్లి మండలాధ్యక్షుడిగా బండి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా పుచ్చకాయల కోటయ్యను, కారేపల్లి మండలాధ్యక్షుడిగా భాగం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పుచ్చకాయల శ్రీనుని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ఎర్రబాబు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి, సిరిపురపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

రఘునాథపాలెం: భవన నిర్మాణ రంగంలో కార్మికులకు పెన్షన్ పథకం అమలుచేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర మహాసభల కరపత్రాలను మండలంలోని కోయచలకలో సోమవారం విడుదల చేశారు. శ్రీనివాస్, నర్సింహారావు, కొండలరావు, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన

నేలకొండపల్లి: టీకాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ అన్నారు. టీకాల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన రిజ్వానా, సౌజన్యలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ బీ.వీరన్న, దేవయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ నారాయణస్వామి, వెంకన్న, వెంకటరాజం, సంఘం అధ్యక్షుడు చింతమళ్ల పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేట్‌ను కొనసాగించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని రావిచెట్టు బజార్ వద్ద ఉన్న రైల్వేగేట్‌ను అలాగే ఉంచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైల్వేగేటు ప్రాంతాన్ని సందర్శించారు. నాయకులు నూనెశేఖర్, సాంబశివారెడ్డి, రవీందర్, అశోక్, కుమార్, ఆదిల్, అన్సారి ఉన్నారు.

బంద్‌కు సహకరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కార్పెంటర్ల సమస్యలు పరిష్కరించాలని, రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ పదిరోజుల పాటు నిర్వహిస్తున్న బంద్‌కు సహకరించాలని కార్పెంటర్స్ యూనియన్ కన్వీనర్ బాణాల చిన్న వీరబ్రహ్మాచారి, కార్పెంటర్ మేస్త్రీల వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దోనోజు పాపాచారి, దూగోడ మిషన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దోనోజు శ్రీనివాసాచారి కోరారు. ఈ మేరకు ఖమ్మం వర్తక సంఘం భవనం నుంచి సోమవారం ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్లు తరబడి రేట్లు పెరగకపోగా వారికి ఇంకా తగ్గించి ఇస్తున్నారన్నారు. వారికి సరైన రేటు ఇవ్వడం పోవడంతో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చి వృత్తి రేట్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ పుల్లయ్య నందిగామ బ్రహ్మం, దోనోజు లక్ష్మయ్య, కార్యదర్శి సోమా నాగరాజు కుమార్, దిగజర్ల వెంకన్న, సండూరి నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జాతర

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెం గ్రామంలో లింగమంతుల జాతర సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేక బోనాలు సమర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, యాదవ సంఘం ప్రతినిధులు, భక్తులు తదితరులు ఉన్నారు.



బోనాలతో వస్తున్న భక్తులు

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

నేలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 42 శాతం రిజర్వేషన్ల కల్పించాలని బిల్లును చట్టసభలో ఆమోదంతో సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే బిల్లుకు మద్దతు తెలపాలన్నారు.

తిరుమలలో కోలాట ప్రదర్శనకు అవకాశం



తిరుపతి బయలుదేరుతున్న కోలాట బృందం

రఘునాథపాలెం: తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో కోలాట ప్రదర్శన ఇచ్చేందుకు మండలంలోని చిమ్మపుడికి చెందిన మహిళలకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా మాడవీధుల్లో ప్రదర్శన ఇచ్చేందుకు చిమ్మపుడికి చెందిన బాలాజీ కోలాట బృందంతోపాటు 200 మంది సోమవారం రైలులో తిరుపతి బయలుదేరారు. కాగా, నాలుగేళ్ల నుంచి మాజీ ఉప సర్పంచ్, బీజేపీ నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన వీరు అక్కడ ప్రదర్శన ఇస్తున్నారు. ఈ బృందం మంగళవారం మాడ వీధుల్లో కోలాట ప్రదర్శన ఇవ్వనున్నారు.

విజయోత్సవ ర్యాలీకి సిద్ధంగా ఉండాలి

ఖమ్మం మామిళ్లగూడెం: నేడు వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టం చేస్తున్న సందర్భంగా మాదిగలంతా విజయోత్సవ ర్యాలీలు చేయడానికి సిద్ధంగా ఉండాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టం చేయబోతున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి

ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయోద్యమ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల అమరత్వాన్ని స్మరిస్తూ ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థి లోకం పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు జార్జిరెడ్డి, నాయకులు మందా సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ ఎదుట భగత్ సింగ్ వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎండి.కైఫ్, ఇందు, రాము, వినయ్, ప్రియాంక, జ్యోతి, శైలజ, వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక సంవత్సరం ముగింపునకు వచ్చిన నేపథ్యంలో పన్నుల వసూళ్లపై సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా అన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పన్నుల వసూళ్లను పర్యవేక్షించారు. క్షేత్ర స్థాయిలో భారీ బకాయిలు ఉన్న వారి వద్దకు వెళ్లి పన్నులు చెల్లించాలన్నారు. ఒక్కో ఆర్ఐ పరిధిలో రోజుకు రూ.10 లక్షలకు పైగా పన్నులు వసూలు చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అనంతరం శానిటేషన్ అధికారులు, ఎస్ఐలు, జవాన్లతో ఏఎంసీ కేఎంసీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఎంసీ అహ్మద్ షఫీ ఉల్లా మాట్లాడుతూ.. ప్రతీ రోజు డ్రెయినేజీలను శుభ్రం చేయాలని, సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేయించి డంపింగ్‌యార్డ్‌కు తరలించాలన్నారు. పారిశుద్ధ్యంను మెరుగుపరిచి స్వచ్ఛసర్వేక్షన్ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానాన్ని సాధించేందుకు కలిసికట్టుగా పని చేయాలన్నారు.

డంపింగ్‌యార్డును సందర్శించిన మేయర్

కేఎంసీ పరిధిలోని దానవాయిగూడెం డంపింగ్‌యార్డ్‌ను నగర మేయర్ పునుకొల్లు నీరజ సందర్శించారు. నాటిన మొక్కల సంరక్షణకు జాగ్రత్తగా వహించి మొక్క తడిచే విధంగా నీరు పెట్టి పాదులు చేయాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో నుండి రోజు వచ్చే తడి చెత్త (గ్రీనరీ వేస్ట్)ను వర్మీ కంపోస్ట్ తయారీకి ప్రక్రియను ఏర్పాటు చేయాలన్నారు. హార్టీకల్చర్ ఆఫీసర్ రాధిక, ఎన్వీరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

అమృత్ పనుల పరిశీలన..

అమృత్ 2.0 నిధులు రూ.249 కోట్లతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను మేయర్ నీరజ పరిశీలించారు. ఖానాపురం ఊరచెరువు నుంచి రామకృష్ణాపురం మున్నేరు వరకు చేరిన మురుగు నీరు అక్కడ ఎస్‌టీపీలో శుద్ధి అయి మున్నేరులోకి వెళ్తుందని ఈఈ రంజిత్‌కుమార్ వివరించారు.



పన్నులు వసూలు చేస్తున్న అహ్మద్ షఫీ ఉల్లా



మొక్కలను పరిశీలిస్తున్న మేయర్ నీరజ

హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు..

నగరంలోని వైరా రోడ్డులో డివైడర్లపై ఏర్పాటు చేసిన ఆస్పత్రులు, దుకాణాల హోర్డింగ్స్, బోర్డులను టౌన్‌ప్లానింగ్ అధికారుల నేతృత్వంలో డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్డులతో పాటు ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి డీఆర్‌ఎఫ్ వాహనంలో వేశారు. నగర ప్రజలకు అసౌకర్యంగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న రవికుమార్

రఘునాథపాలెం: విద్యార్థులు ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు తోడ్పాటు అందించినప్పుడు ఫలితాలు బాగుంటాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను, వివిధ అంశాల్లో జిల్లా, మండల స్థాయిలో బహుమతులు అందుకున్న విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములు, సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రవీణ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బంది రావొద్దు..



కస్తూర్బాలో మాట్లాడుతున్న రమేష్

కూసుమంచి: రైతులకు సాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం కూసుమంచిలోని మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కరుణ శ్రీ, ఎంపీడీఓ వేణు గోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈఈ రత్నకుమారి పాల్గొన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను ప్రత్యేకాధికారి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ శేషగిరిరావు సందర్శించారు. పాఠశాలలో వసతులను, మెనూను అడిగి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి రంజాన్ తోఫా

ఖమ్మం మామిళ్లగూడెం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 23వ డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్ కేఎంసీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది, ట్రాక్టర్, ఆటో డ్రైవర్లు తదితరులకు దుస్తులు అందజేశారు. ఈ మేరకు నగరంలోని ముస్తఫా నగర్ మసీదులో దుస్తులతో పాటు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఇలియాస్, సలీం, జమాల్, అజూ, జాకిర్, మునాఫ్, కరీముల్లా, జాన్ తదితరులు ఉన్నారు.

ఈనెల 29న కేఎంసీ ముట్టడి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ప్రధాన సమస్యలపై ఈనెల 29న కేఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గాంధీచౌక్, కమాన్‌బజార్ వీధులకు అనుసంధానంగా ఉన్న రైల్వే గేటును పూర్తిగా మూసివేశారని, తక్షణమే మినీ ప్లై ఓవర్ నిర్మించాలన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దొంగల తిరుపతిరావు, ఎంఏ జబ్బార్, ఎస్‌కె. మీరా సాహెబ్, వజినేపల్లి శ్రీనివాసరావు, భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

రఘునాథపాలెం: పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మంచుకొండ జెడ్పీహెచ్ఎస్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం కరుణకుమారి, ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, ఉపాధ్యాయులు భానుమతి, అంజన్‌రాజు, శ్రీనివాసరావు, సుజాత, నజీమా తదితరులు ఉన్నారు.

మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా శివారు జింకలగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ మదర్ సాహెబ్ ట్రస్టు ఆధ్వర్యంలో సయ్యద్ ఇమామ్ జల్లెపల్లి పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఎస్సై కూచిపూడి జగదీశ్, ఎంఈఓ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. హెచ్‌ఎం రాజేష్, కిరణ్, ట్రస్ట్ ట్రెజరర్ సైదా సభ్యులు చందు, సైదా, ఇమామ్,అమీర్, జాఫర్ ఉన్నారు.

మహిళల నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: బాధితురాలు లక్ష్మికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జెడ్పీసెంటర్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున మహిళలు నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పువ్వాడ ఉదయ్‌నగర్‌కు చెందిన లక్ష్మిని పెళ్లి చేసుకుంటానని నర్సింహారావు అనే వ్యక్తి మోసం చేశాడని, అధికారులు న్యాయం చేయాలని కోరారు. భూక్యా ఉపేంద్ర బాయి, స్పందన, అమృత భవాని, ప్రమీల, లక్ష్మి, విజయ, జ్యోతి, త్రివేణి తదితరులు ఉన్నారు.

ప్రతిష్ఠ పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్తా దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేకల హనుమంతురావు, కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు, సరిపుడి రమా సతీష్, సభ్యులు తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

తిరుమలాయపాలెం: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రామదాసు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షులు సైదులు, భిక్షం, ఎల్లయ్య, రమేష్, కొమ్ము రవి, పుల్లయ్య, రాజేష్, ఉమేష్ ఉన్నారు.

ఆయకట్టు రైతులను ఆదుకోండి సారూ..

నేలకొండపల్లి: నందిగామ కత్తువ ఆయకట్టులోని చివరి భూములకు సాగునీరు అందించి ఆదుకోవాలని పలువురు రైతులు అధికారులను వేడుకున్నారు. మండలంలోని సదాశివాపురం, పాత కొత్తూరు, నేలకొండపల్లి గ్రామాలకు చెందిన పంట పొలాలను అధికారులు సోమవారం పరిశీలించారు. ఎండుతున్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మరో రెండు తడుల నీరు అందిస్తే తప్ప పంట చేతికి రాదని రైతులు వాపోయారు. అనంతరం తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ యం.యర్రయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన వారబంధీ విధానం ద్వారా వచ్చే నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఏఈ కె.రామారావు, ఇరిగేషన్ ఏఈ నరేష్, ఏఈవో అరవింద్ ఉన్నారు.



పంటను పరిశీలిస్తున్న అధికారులు